**కథానిక**

# "బోనాలకెల్లండిరా బొట్టెలారా!"

వై. వి. యస్. యస్. యస్. మూర్తి

సముద్రాలు కుక్కిమంచంలో పిల్లిలా అంటుక్కుపోయి మూలుగుతోంది. అస్థిపంజరానికి గుడ్డలు చుట్టబెట్టి పడవేసినట్లుంది సముద్రాలు. మూసిన కన్ను ఎత్తడంలేదు. జ్వరంతో వొళ్ళు పేలిపోతోంది. తొట్టిలాంటి మంచంలో ప్రక్కలు పరచివున్న చింకి గుడ్డమాసి, జిడ్డు పట్టి చెమటకు తడిసి గౌలు కంపు కొడుతోంది. ఎముకల గూడును దాచిపెట్టుకోవడానికి సముద్రాలు చుట్టబెట్టుకున్న గుడ్డపాతలు రెండూ చెదిరిపోయి అస్తవ్యస్తంగా ఉన్నాయి. శవం మీద ముసిరినట్లు ఈగలు ముసురుతున్నాయి సముద్రాలు ఎండిన గుండెలమీద పేకులపోయి బయటకు పొడుచుకొచ్చిన దవడ ఎముకల పోయిన తడారి పోయిన పెదవులపైన, గుంటలు పడ్డ కళ్ళమీద, రెప్పలమీద, మంచం ప్రక్కనే సముద్రాలు అప్ప ఈరమ్మ కూర్చుని చిరిగిన కొంగుతో గాలి విసురుతూ మరొక చేత్తో ఈగల్ని తరుముతుంది. సముద్రాలు అత్త పెంటమ్మ కోడలి తలవైపున గుంటి గుంజకు జారబడి కూర్చొని కోడలి ముఖం కాసి చూస్తున్నది. మంచం చుట్టూ సముద్రాలిపిల్లలు దిశ మొలలతో నిలబడి తల్లివంక భయంభయంగా ఆతృతగా చూస్తున్నారు. వాళ్ళలో పన్నెండేళ్ళ అసిరిగాడికి మాత్రం గోచి ఉంది. తతిమ్మ పిల్లలు సెందిరిగాడు, పోలిపల్లి, గౌరి దిశ మొలలతో నల్లగా దుమ్ముపట్టి దిష్టిబొమ్మల్లా ఉన్నారు.

సముద్రాలికి వారం రోజులనుండి జ్వరం తగ్గడంలేదు. మొదటి రెండు రోజులు అదే తగ్గిపోతుందని మొండిగా పని- పాటుకు వెళ్ళింది. కానిమూడో రోజున జ్వరం మోపుచేసింది ఆ రోజు లేవలేకపోయింది. లంఖణంచేస్తే జ్వరం తగ్గుతుందని వేడి వేడి గంజి మాత్రం తాగింది. అది ఇమడలేదు. వాంతి అయిపోయింది. అప్పటికే సముద్రాలి మగడు పైడియ్య పనిలోకి పోయాడు. పెద్దకొడుకు అచ్చిగాడు కామందుల కొలువుకు పోయాడు. అసిరిగాడు గొడ్లను మేపడానికి పోయాడు. చిన్న పిల్లలు ఉన్నారు ఇంటిదగ్గర. అత్త పెంటమ్మ అసలే ముసలిది. కదల్దు. చూపు ఆనదు ఆస్థితిలో సముద్రాలి దిక్కు చూసేవాళ్ళు ఎవ్వరూలేరు. ఎండ ఎక్కాక పదిగంటల వేళప్పుడు కొంచెం ఓపికచేసుకొని ఆచారిగారింటికి వెళ్ళింది మందుకోసం. ఆచారి ఆ ప్రాంతాల్లో మూడు-నాలుగు ఊళ్ళకు ఒక్కడే సంచికట్టువైద్యుడు. తన ఇంటికి సము

దాలు రావడం చూసిన ఆచారి గుమ్మం వరకూ ఆమెను రానివ్వలేదు " అగు! అక్కడే!" అంటూనే బుపేసి తనే సము ద్రాలు దగరకు వెళ్ళాడు. బాధఏమిటో తెలుసుకొని రెండు మాత్రలు ఇచ్చి, నీళ్ళల్లో వాటిని రంగరించి వేసుకోమని చెప్పాడు. ఆయనకు దండం పెట్టి పడుతూ - లేస్తూ ఇంటికి చేరింది సముద్రాలు. ఆచారి చెప్పినట్లుగా మాత్ర నీళ్ళలో రంగరించి వేసుకొంది. కాని ఇమడలేదు. పైగా పెద్ద వాంతి అయిందికూడా. నిస్త్రాణగా అలా పడి పోయింది. కోడల్నిస్థితిలో చూసి అత్త అల్లాడి పోయింది. మధ్యాహ్నపు వేళ గంజికొచ్చిన అసిరిగాడి చేత సముద్రాలి అప్ప ఈరమ్మకు కబురు పంపింది. ఈరమ్మ వచ్చేసరికి జ్వరం మరింత తీవ్రమయిపోయింది. సాయంకాలం పెంటయ్య వచ్చాక వళ్ళాఅతడ్ని ఆచారి దగరకు పంపింది ఈరమ్మ. "బేవారు బేరం" అని విసుక్కుంటూ మరోరెండు మాత్రలు ఇచ్చిపంపాడు ఆచారి. పెంటయ్య ఆ మాత్రలు తెచ్చి ఈరమ్మకు ఇచ్చాడు. మందు వాడిన ప్పటికీ మరుసరిటిరోజుకూడ జ్వరం తగ్గలేదు ఒకసారివచ్చి చూడమని కబురు పంపినా రాలేదు ఆచారి. పైగా ఇంట్లోఉండి, ఊర్లోలేదనిపించుకున్నాడు కూడా. పై వూరు వైద్యానికి వెళ్ళే స్తోమతలేదు వాళ్ళకు. ఇక వేరేదారిలేక గచ్చాకు - పుచ్చాకు వైద్యం ఆరంభిం చింది ఈరమ్మ. ప్రయోజనం ఏమీ కన్పించడంలేదు. అసలు ఈవేళ మూసిన కన్ను తెరవకుండా పడివుంది సము ద్రాలు. అప్పుడప్పుడు కొంచెం కదిలినా అంతలోనే చాప చుట్టపడి వుంటుంది సముద్రాలు.

లచ్చుమినాయుడు శిరసపల్లె గ్రామా నికి సర్పంచ్. పైగా మోతుబరిరైతు. మంచి పలుకుబడి ఉన్నఆసామీ ఆయన కూతురు సుధకు పట్నంలో డాక్టరుగావున్న మురళితో పెళ్ళినిశ్చయ మయింది. లక్షరూపాయల కట్నం. భారీగా కానుకలుకూడా ఇస్తున్నారు లచ్చుమి నాయుడు వరునకు. ఈవేళ పెండ్లి పెండ్లికి ఎక్కడెక్కడనుండో గొప్ప గొప్ప వాళ్ళందరూ వచ్చారు. గ్రామంలో చిన్నా - పెద్ద, ముసలి-ముతక, మాల-మాదిగ అందర్నీ భోజ నానికి పిలిచాడు లచ్చుమి నాయుడు. వాళ్ళ - వాళ్ళ స్థాయినిబట్టి భోజనాలు ఏర్పాటుచేశాడు నాయుడు. ఈవేళ గ్రామంలో కూలిజనం, చిన్నా - పెద్ద, మాల - మాదిగ అందరూ ఆయనింటి దగ్గరే ఉన్నారు. పెంటయ్య అచ్చిగాడు తెల్లవారుజామునుండే వంచిన తల ఎత్త కుండా అక్కడే పనిచేస్తున్నాడు వంట శాలల్లో రకరకాల పిండి వంటలు తయారు చేస్తున్నారు పట్నం నుండి వచ్చిన వంటవాళ్ళు. వాటి పేర్లేమిటో అక్కడ పనిచేసుకుంటున్న కూలి జనా నికి తెలియదు. "అబ్బా! వరికూడు ఎలాతెల్లగా సున్నంలా ఉందో! ఎన్నాళ్ళ యిందో ఇలాంటి కూడుచూసి." అని సంబరపడిపోయారు వాళ్ళు. ఎప్పుడూ రాగి సంకటి, నూకలజావ తప్ప మరేమీ ఎరగని ఆ జనానికి అన్నాన్ని, పిండి వంటల్ని చూడ్డంతోనే కడుపునిండిపోయి

నట్లయింది. జన్మకో శివరాత్రి అనిమంచి భోజనం దొరుకుతుందన్న ఆశతో వాళ్ళంతా వంచిన నడుం ఎత్తకుండా మహాచురుగ్గా చక - చకా పనులుచేస్తున్నారు. అజమాయిషీ చేస్తున్న లచ్చుమి నాయుడుమీసాలు క్రమెలేసుకుంటూ గర్వంగా నవ్వుకుంటున్నాడు.

X X X

"కూడు తినేయాల అయిపోనాది. భోజనాలకి యెల్లండిరా బొట్టుల్లారా!" అంది ఈరమ్మ. "మరి అమ్మో!" అన్నారు పిల్లలు.

"మాం ఉన్నాం కాదా! సూసుకుంటాం. మీరు బేగెల్లి వొచ్చెయ్యండి. మీ అయ్యని-అన్నని కేకేసితీసుకురండి. అప్పుడు మాం యెల్తాం" అందిఈరమ్మ. పిల్లలు ఇంటిలోని తలకొక గిన్నె తీసుకొని బయలుదేరారు భోజనాలకి. "అవునే! ఈరీ! పెళ్ళి భోజనాలకి ఏ వేటిసేత్తారే?" అని అడిగింది పెంటమ్మ.

"నాకేటి తెలస్తది అత్తా! మావూరిలో శీష్టమ్మ నాయుడి కొడుకు పెళ్ళికి నడ్డుండలు - బూర్లు - అరిశెలు-పులిగోదర-పప్పు--కోరలు-ఇంకేటేటో చేసినారు. అందరికీ కడుపునిండా బువ్వెట్టినారు. జలమలో అటువంటి కూడు నాను చూడలేదు. కూడు తెల్లగా పువ్వులాగుంది." అంది ఈరమ్మ.

"అదురుష్టమంతురాలువే! పెట్టిపుట్టినావు. సక్కటి రాచకూడు తిన్నావు. నా జలమలో నువ్వు సెప్పిన నడ్డుండలు కంటితో సూడలేదు. సెప్పుకోగా యినుకోడమే ఒకతూరి అయ్యేమో కుడుములంట, అయ్యో రెండు, రెండు గార్లు—కాసింత కోడికూర ఇగురు తిన్నానే. జిమ్మ తేచొచ్చింది." అంది పెంటమ్మ.

"పోనిలే అత్తా! లచ్చుమి నాయుడుగోరు కూతురి పెళ్ళి వైభోగంగా సేత్తన్నాడట. ఇయ్యేళ తిందువుగానిలే! నాను దగ్గరుండి తీసుకెల్తాగాదా!" భరోసా ఇస్తున్నట్లు అంటూ ఈరమ్మ సముద్రాలి ముఖంకేసి చూసింది. నోటినుండి నురగలాగ ఏదో వస్తున్నది. మూలుగుకూడా తగ్గిపోయింది. ఈరమ్మ పై ప్రాణాలు పైనే పోయాయి. "సముద్రాలూ! ఓలమ్మో! సముద్రాలూ! ఏటో లమ్మో! ఇది? ఓరి దేవుడో! నా నేటిజెతునురో! అత్తో! అమ్మి సముద్రాలుఏటో అయిపోతుంది. నోటినుండి నురగొస్తుంది. ఇప్పుడేటి సెయ్యడం? అయ్యో అయ్యో!" అంటూ శోకాలు పెడ్తుంది ఈరమ్మ. పెదమ్మ లేచి చెయ్యి కోడలి ముఖంమీద-వొంటిమీదవేసింది. మంచు గడ్డలా తగిలింది శరీరం. ముక్కు దగ్గర చెయ్యిపెట్టి చూసింది. శ్వాస ఆగి


మీ చందా అయిపోయిందని

గుర్తు చేస్తూ కార్డు వచ్చిందా!

వెంటనే చెల్లించండి.

'అభ్యుదయం'

తో సహకరించండి.

పోయినట్లుంది. "ఇంకేటోలమ్మ! సిలక ఎగిరిపోనాది. వాళ్ళంతా తడిగుడ్డ అయి పోనాది. ఓలి తల్లీ! నమ్ముదాలా! ఎంత పనిజేసినావె ! నాకేది దారి ! ఓలమ్మ ! ఈరమ్మ ఆళ్ళకి కబురంపే!" అంటూ గుండెలు బాదుకుంటూ శోకాలు పెట్టింది పెంటమ్మ

"భోనాలయాలు! భోనాలకాడ కూకు న్నారేటో! ఎదురింటి తవిటప్ప కొడుకు ఇంటికాడే ఇంకున్నట్లున్నాడు. ఆడికి సెబుదునా! పోయి" అంది ఈరమ్మ.

"బేగ పారిరా!" అంది పెంటమ్మ ఏడుస్తూ.

x x x x

మూడు గంటల వేళ దాటిపోయింది. లచ్చుమి నాయుడింట దగ్గర పెళ్ళి భోజ నాలు ఘనంగా అయిపోయాయి. అతిథు లందరూ భోజనాలఏర్పాట్లను ఎంతగానో మెచ్చుకున్నారు. ఇప్పుడు కూలిజనానికి భోజనాలు వడ్డిస్తున్నారు ఒక ప్రక్క. కూలీల్లో మాల-మాదిగలకు పెళ్ళి-పం దిరి బయట వడ్డన ప్రారంభించారు. అంతా బారులు తీర్చుకొని కూర్చున్నారు గొంతుగ్గా. వడ్డించబోయే పదార్థాల కోసం-అన్నంకోసం ఆతృతగా ఎదురు చూస్తున్నారు. వడ్డన సాగుతోంది. వడ్డిం చినవి వడ్డించినట్లే మాయమవుతున్నాయి ఎవరో తమను తరుముతున్నట్టు ఆతృతంగా తింటున్నారు ఉన్నట్లుంది కేకలు, మధ్యలో కుక్కలు వాళ్ళతో కలబడు తున్నాయి. గడ్డంతో వాటిని తరుముతు న్నారు. అవిమాత్రం వాళ్ళ ఆకుల్లో కలబడుతూనే ఉన్నాయి. ఆ గుంపులో ఒక ప్రక్క పెంటయ్య-అబ్బి-అసిరి గాడు, తతిమ్మా పిల్లలంతా ప్రక్క ప్రక్కనే కూర్చున్నారు. పిల్లలు వడ్డిం చినవి వడ్డించినట్లుగానే ఆతృతగా నోట్లో కుక్కుంటున్నారు. ఇంతలో తవిటప్ప కొడుకు చెంచుగాడు వచ్చి

---

అణచి పెట్టిన స్వాతంత్ర్యం

ఉబుకుతుంది లావాలా

అది చరిత్రలో విప్లవాలు చెప్పిన సత్యం

అది జరుగుతూనే ఉంది నిత్యం

—ఎల్లోరా

పెంటయ్యకు సముద్రాలు చచ్చిపోయిన కబురు అందించాడు. ఆ కబురు విని పెంటయ్య నిర్ఘాంతపోయాడు. కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. నోట్లో గుడ్డ కుక్కుకున్నాడు. ఆకుమూసేసి లేవబొయ్యాడు.

"ఏటిరా! ఏటానిది?" అని అడిగాడు పక్కింటి పుల్లిగాడు. "ఆదది దాటిపోనాదట. కబురొచ్చింది." అన్నాడు పెంటయ్య దుఃఖంతో. "అయితే ఏటానిదిరా! దానికాలం దీరి అదెల్లిపోనాది నువ్వేటి జేత్తావు. కూడుతిండం మానేత్తే అది బతుకుతాదా? తిరిగి వస్తాదా? ఈ కూడు తిండం మానుకుంటే నీజలమలో మల్లీ ఇటువంటి కూడు దినగలవా? పిల్లలకు చెప్పినావా ఏడుస్తారు. తిండి దినరు. నీ జలములో వాల్లకింత మంచి బువ్వ ఎట్టగలుగుతావా? నా మాటిను బువ్వతిను. తిన్నాక ఏటి సేద్దామో ఆలోచిద్దాం." అన్నాడు పుల్లిగాడు తేలికగా సలహా ఇస్తూ, "ఇంటికాడ మాయమ్మ. మా వదిన బెంగటిల్లి పోతున్నారట. నాను పోవాల!" అన్నాడు పైడియ్య దీనంగా.

"ఆగరా! గాడిదకొడకా! సెప్పింది నుకో! కూడు తినుముందు" అని కసిరాడు పుల్లిగాడు. అయినా ఉండబట్టలేక పైడియ్య పెద్దకొడుకు అచ్చిగాడితో– "మీ అమ్మ మనల్ని వొదిలిపెట్టి పోనాదటరా!" అన్నాడు దుఃఖంతో.

"ఆఁ? అని నిర్ఘాంతపోయాడు అచ్చిగాడు ఒక్క క్షణం. మళ్ళా అంతలోనే తేరుకొని భోజనంచెయ్యడంలో నిమగ్నదయ్యాడు అచ్చిగాడు.

X X X X

అందరి భోజనాలు అయ్యేసరికి సాయంకాలం ఆరుగంటలయింది. వంటశాలల్లో రాత్రి భోజనాలకి ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఆఖరి పంక్తిలో చివరగా ఒకప్రక్క కళ్ళు వొత్తుకుంటూ ముక్కు చీదుకుంటూ భోజనం పూర్తి కానిచ్చిలేచారు సముద్రాలు అప్ప ఈరమ్మ, అత్త పెంటమ్మ కూడా....

---

## "సీ రియల్"

ఇప్పటి గ్రీష్మం నీ వశం కావచ్చు
రేపటి వసంతం మావశం
అంతగా ఎదిగి అందరికీ నీడనిస్తుంది.
దాన్ని ఎందుకలా నరుకుతావ్
ఆ నీడ నీ కళ్ళకు సరిపడదా?
నువ్వు అణచాలనుకుంటే అణగదు
ఒక్కసారి నరికితే పది చిగుళ్లువేస్తుంది.
పది కొమ్మల్ని నరికితే వేయి చేతులై
అది నీ మెడవైపే ప్రయాణం
నీ మెడవైపే దాని ప్రయాణం
నీవు ఎంతగా అణిస్తే
అంతగా విజృంభణ
సీరియల్‌గా నరికితే
సీరియస్‌గా నీవైపే.....................

—పి. యస్. రవీంద్ర

---

ఎక్కడుంది స్వేచ్ఛ?
విత్తనాన్ని చీల్చిన మొక్కలో
ఎక్కడుంది స్వేచ్ఛ?
విహాయసాన్ని పొడిచిన చుక్కలో

—సి నా రే